# ఫ్యామిలీ టైప్



## సింగరాజు రమాదేవి

ఎప్పటిలాగే బాగా రద్దీగా వున్న మా ఆఫీస్‌రోడ్‌లో బండి జాగ్రత్తగా నడుపుతూ వస్తున్నా. బండి రిజర్వ్‌లో పడిందన్న సంగతి గుర్తుకు వచ్చి పెట్రోల్ బంక్ వైపుకి పోనిచ్చాను. అదృష్టవశాత్తు పెద్ద క్యూ లేదు. నా ముందు ఇద్దరు కాలేజ్ కుర్రాళ్ళు మాత్రం ఉన్నారు.

రేయ్! కల్పనలో కొత్త పిక్చర్ వచ్చిందిరా, సెకండ్ షోకి వెళ్దామా? అంటున్నాడు, కళ్లజోడు అబ్బాయి. టీషర్ట్, జీన్స్‌లో ఉన్నతను, అబ్బ వద్దురా, అందులో ఆమని హీరోయిన్, అంతా ఫ్యామిలీ టైప్, మనకి పడదు అన్నాడు.

ఫ్యామిలీ టైపా?, పెట్రోల్ పోయించుకుని, బండి కిక్ కొడుతూ అనుకున్నాను. అంటే ఏమిటి? ఇల్లు చేరుకునే సరికి ఆరున్నర అయింది. బ్యాగ్, డైనింగ్ టేబిల్ మీద పడేసి, బాత్రూమ్ వైపు నడిచా. మళ్ళీ ఒక మూడు గంటలు ఇంటి పనితో కుస్తీ పడితే గానీ, పక్క చేరే అవకాశం లేదు.

మర్నాడు రండి,రండి సుమిత్రగారూ, మీ కోసమే చూస్తున్నాము, ఆఫీసులో అడుగుపెట్టగానే మా ఆఫీసరు నవ్వు ముఖంతో అన్నాడు. ఆయన నవ్వుతున్నాడంటే నాకేదో మూడింది అనుకుంటూ ఏం సార్ ఎందుకూ? అన్నాను. రిజిస్టర్‌లో సైన్ చేస్తూ. మన cashier లేదండీ. మీరే క్యాష్‌లో కూర్చోవాలి అన్నాడు. మళ్లీ ఏమైంది ఈవిడకి, ఎందుకు రానట్టో, గొణుక్కుంటూ ఆయన దగ్గరి నుంచి తాళం చెవులు లాక్కుని కౌంటర్ వైపు నడిచాను.

ఇవాళ వరలక్ష్మి వ్రతం కదా, అందుకే రాలేదేమో టైపిస్ట్ రేణుక అంది. నేను అయోమయంగా చూసే సరికి, ఆవిడ ఫ్యామిలీ టైప్‌లే వ్రతాలు, నోములూ ఉంటాయి అంది. ఒక రకంగా నవ్వుతూ. 'ఫ్యామిలీ టైప్', మళ్లీ అదే పదం ఆలోచిస్తూ కౌంటర్‌లో అడుగుపెట్టాను.

క్యాష్ ట్యాలీ చేసి, అన్నీ అప్పగించి, ఆఫీస్ నుంచి నీరసంగా ఇల్లు చేరాను. హాల్లోనే ఏవో సూట్‌కేసు, బ్యాగు చూసి దడుచుకున్నాను. ఈ సమయంలో ఏ చుట్టాలనో భరించే ఓపిక లేదు నాకు.

హాయ్ సమీ! ఏంటి ఇంత ఆలస్యం అంటూ మా పెద్దమ్మ కొడుకు ఎదురొచ్చాడు. నువ్వాట్రా! హమ్మయ్య, నేను ఇంకా ఎవరో పెద్ద చుట్టాలు అని హడలి చచ్చా. అయినా నువ్వేంటి ఇలా ఊడిపడ్డావు అన్నాను.

ఏం లేదు. ఇక్కడేదో సంబంధం ఉంది, చూసి రమ్మని అమ్మ ఒకటే పోరు. ఇహ అదేదో తేల్చుకోంది వదిలేట్టు లేదని ఇలా బయలుదేరాను.

సరే మంచి పని చేశావు. ఇప్పటికే ముప్పై ఏళ్ళు పైబడి ముదిరిపోయావు. ఇంకొన్నాళ్ళు అయితే ఏ పిల్లా చేసుకోదు. నవ్వుతూ అని వంటింటి వైపు నడిచాను. నా వెనకే వచ్చి పల్లీ డబ్బా అందుకుని గట్టు మీద కూర్చుని నువ్వూ రావాలే రేపు నాతో పాటు నేను ఒక్కణ్నే ఏం వెళ్లను అన్నడు.

ఏమిట్రా? రేపు నువ్వు సంప్రదాయ బద్ధంగా వాళ్లింటికి వెళ్లి పిల్లని చూసి వాళ్ళు పెట్టినవి మెక్కి వస్తావా? దానికి నేనొక లీవ్ వేస్ట్ చేసుకోవాలా, నేను చచ్చినా రాను. పల్లీల డబ్బా వాడి చేతిలోంచి అందుకుని గూట్లో పెట్టేసా అదెక్కడ ఖాళీ చేస్తాడో అని భయపడి.

అబ్బా! నాకు తెలుసు లేవే, నీకా తతంగం ఇష్టం లేదని. వాళ్ళాఫీసుకి వెళ్ళి చూసొద్దాం అన్నాడు. అలా అన్నావు బావుంది. అదీ నువ్వొక్కడివే వెళ్లు. పదండి, అందరికీ వడ్డించేస్తాను, అన్నాను.

ఏరా! వెళ్ళిన పని సక్సెసా! ఎలా వుంది అమ్మాయి? ఇంట్లో అడుగుపెడుతూనే ప్రశ్నలు గుప్పించాను. ఆం బావుంది. నాక యితే నచ్చేసింది. పెద్ద కళ్ళు,పెద్ద జడ, చీర కట్టుకుని ఉంది. చాలా నెమ్మది అనుకుంటా అంతా ఫ్యామిలీ టైప్ అన్నాడు వాడు ఉత్సాహంగా. ఉలిక్కిపడ్డాను. ఫ్యామిలీ టైపా? పెద్ద జడ! పెద్ద చీర!

ఒరేయ్, నువ్వు మొన్నటి దాకా మోడరన్ డ్రెస్సులు వేసుకుని, జుట్టు కత్తిరించుకున్న అమ్మాయిల్ని ఇష్టపడే వాడివి పైగా ఈ ఆరు గజాల చీరలేవిటి? హాయిగా ఇంట్లో నైటీ వేసుకోక అని మీ అమ్మకి సలహాలిచ్చే వాడివి. ఇదేమిట్రా? అన్నాను ఆశ్చర్యంగా.

అబ్బా! సుమీ. నీతో ఇదే గొడవ. గర్ల్‌ఫ్రెండ్‌కి, భార్యకి ఆ మాత్రం తేడా ఉండక్కర్లా. ఎనీ వే, ఐ థింక్, ఐ లైక్ హర్. అన్నాడు.

నేను నిట్టూర్చి ఊర్కున్నాను.

హాయ్ సుమిత్రా! బాగున్నావా! లంచ్ అవర్‌లో భోంచేస్తున్న నన్ను పలకరించింది పక్క సెక్షన్ మీనాక్షి. హలో, ఏంటి ఈ మధ్య కనపడలేదు అన్నాను.

నేనా! లీవ్ పెట్టి ఒక వారం మద్రాస్ వెళ్లానోయ్ మా అత్తగారింటికి అంది. ఈ ఎండల్లోనా అడిగాను. అవును కానీ ఈ నెలాఖరికి మన లిగిది బ్లాక్ అయిపోతుందిగా అందుకు అంది.

అరే నిజమా! నేనూ వాడుకోలేదు. ఎటైనా వెళ్ళాలి. చెయ్యి కడుక్కోడానికి వాష్ బేసిన్ వైపు నడిచా. రవి ఆఫీసుకి ఫోన్ చేసి అదే అన్నాను. సరే కానీ మైసూర్, ఊటీ మనం చూసినవేగా ఈసారి ఇంకెటైనా వెళ్దాం అన్నాడు. కొడైకెనాల్ వెళ్దామా? మా మీనాక్షి చాలా బాగుంటుంది అని చెప్పింది అన్నాను.

ఏ కళనున్నాడో వెంటనే ఒప్పేసుకున్నాడు. మర్నాడే టిక్కెట్లు బుక్ చేసేశా.

మొత్తానికి రెండు రైళ్ళు ఒక బస్సు మారి కొడైకెనాల్ చేరుకున్నాం. టాక్సీలో కూర్చుని అలసటగా కళ్ళు మూసుకున్నాను. మంచి హోటల్‌కి పోనీవోయ్! అంటున్నాడు రవి టాక్సీ వాడితో వచ్చీరాని అరవంలో.

హోటల్ పెద్దదే. బ్యాగులు,సూట్‌కేసు మోసుకుంటే లోపల రిసెప్షన్ కౌంటర్ దగ్గరికి నడిచాం. ముక్కు మీంచి జారిపోతున్న కళ్ళజోడు మెడ మీంచి జారిపోతున్న టై సర్దుకుంటూ లేచాడు రిసెప్షనిష్టు.

డీలక్స్ రూమ్ ఉందా అన్న రవి ప్రశ్నకి ఒకసారి మళ్లీ కళ్లజోడు, టై సర్దుకున్నాడు. ఒకసారి నా వంక, రవి వంక చూసి తల దించుకున్నాడు. పక్కనున్న రిజష్టర్ పేజీలు తిరగేసి ఏదో గొణిగాడు. మళ్లీ నా వంక ఎగాదిగా చూశాడు.

ఇది ఓన్లీ ఫర్ ఫ్యామిలీస్ సార్ అన్నాడు చిన్నగా. నాకర్థమైపోయింది. ప్రయాణంలో వీలుగా వుంటుందని వేసుకున్న నా జీన్స్ ఎప్పుడూ బోసిగా వుండే నా మెడ అతనికి 'ఫ్యామిలీ టైప్'లా అనిపించినట్లు లేవు.

నేను వెంటనే వెనక్కి తిరిగి చింటూ అని కేకేశాను.

బయట ఐస్‌క్రీమ్ షాప్ దగ్గిర ఆగిపోయి ఒకటి కొనుక్కుని మెల్లగా అది చీక్కుంటూ వస్తున్నాడు పదేళ్ళ నా పుత్రరత్నం చింటూ.

నా పన్నెండేళ్ళ పాతివ్రత్య జీవితానికి నేను 'ఫ్యామిలీ టైప్' అనడానికి నాకున్న ఒకే ఒక్క సాక్ష్యం వాడే మరి!

## అజయ్ చక్కని వంటగాడు: కాజోల్



పెళ్ళి తర్వాత కాజోల్ మళ్ళీ సినిమాల్లోకి వచ్చింది. ఆమె తాజా చిత్రం విడుదలయ్యింది. పెళ్ళయి రెండేళ్ళయిన ఆమె గ్లామర్‌కు వచ్చిన లోటు ఏం లేదన్న మాట వినబడుతోంది. ఇప్పుడు సంసారం, మరోవైపు నటన తోడు కావడంతో జీవితం యమబిజీ కాలేదా అంటే "నేను నా పనిని, కుటుంబాన్ని ఎంజాయ్ చేస్తున్నాను" అని చెబుతోందామె. తీరిగ్గా ఉన్నప్పుడు పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, టీవీ చూడటం తన వ్యాపకాలు అంటోంది. ఇంట్లో ఉంటే తన భర్త అజయ్‌తో కబుర్లు చెప్పుకోవడం, కలిసి టీవీ చూస్తామని, సంగీతం వింటామని చెబుతోంది. అజయ్ ఏదైనా వండగలడని, చేపలకూర బాగా చేస్తాడని, నిజానికి తను చక్కని వంటగాడని ఆమె నవ్వుతూ చెప్పేస్తోంది. మొత్తమ్మీద తాము హాయిగా, ఆనందంగా ఉన్నామన్నది ఆమె మాటల సారాంశం. కనుక తిరిగి సినిమాల్లో నటించినంత మాత్రాన తమ మధ్య పొరపొచ్చాలు వచ్చే అవకాశం లేదని ధీమాగా చెబుతోంది కాజోల్. అంటే ఆమె ఎదుగుదలని అజయ్ బాగా ఇష్టపడతాడన్నమాట!